జూన్ ,2026



శ్రీ ప్రణవపీఠం

सत्यं वद - धर्मं चर

ఏలూరు



# జూన్ , 2026

జూన్ , 2026

## విషయ సూచిక

సంపుటి-5
సంచిక-6


01 సంపాదకీయం
బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

02 శ్రీ గణేశ పురాణం
శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య

03 శ్రీ వేంకటేశ్వర రహస్యం
శ్రీమతి నిడుముక్కల శ్రీకరి

04 శ్రీ మత్స్యమహాపురాణం
మద్దూరి వేంకట సుబ్రహ్మణ్య సత్యనారాయణ

05 ఐశ్వర్యయోగం
బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

06 ఋషిచరిత్ర
శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం

07 కాశీ కథలు
శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం

08 స్తోత్రమాలిక
బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్




శ్రీ మహాగణాధిపతయే నమః   శ్రీ గురుభ్యోనమః   శ్రీ మాత్రే నమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.

https://srivaddipartipadmakar.org


© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.


# శ్రీ గురుభ్యోనమః

# సంపాదకీయం

## గురు మార్గం

శ్లో॥ అభ్రచ్ఛాయా ఖలప్రీతిః
సిద్ధమన్నం చ యోషితః
కించిత్కాలోప భోగ్యాని
యౌవనాని ధనాని చ ॥ (సుభాషితశ్లోకం)



మబ్బులు కమ్మినప్పుడు కొంతసేపు నీడ ఏర్పడుతుంది. మబ్బు తొలగగానే నీడ కూడా పోతుంది. ఈ వేసవిలో మనకు ఇటువంటి నీడలు కాసేపు హాయినిచ్చి తొలగిపోతాయి. ఈ మేఘచ్ఛాయ ఎక్కువసేపు ఉండదు. అందుకే సుభాషితాలలో, మబ్బులనీడ, నీచుల ప్రేమ, వండిన అన్నం, వేశ్యాస్త్రీల ప్రేమ, యౌవనం, ధనం — ఇవన్నీ కొంతకాలమే ఉపయోగపడతాయి అనీ ఎక్కువ కాలం ఉండవు, అనీ అర్థం వచ్చే ఈ శ్లోకం ఉంది. అన్నం వండుకొన్నాక తినకుండా ఒక రోజు అట్టే పెడితే పాడైపోతుంది. నీచుల ప్రేమ నిలబడదు. వేశ్యలప్రీతి కూడా అంతే. యౌవనం, ధనం చకచకా కరిగిపోతాయి. ఇవి గ్రహించి కాలాన్ని, ధనాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ కలియుగంలో కపట ప్రీతిని ప్రదర్శించేవారే ఎక్కువ. వారి విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ యుగంలో మాట్లాడినా తప్పే. మాట్లాడకపోయినా తప్పే. మన బ్రతుకు మనలను బ్రతకనివ్వక వీధికి లాగేవారే ఎక్కువ ఉంటారు. తెలివిగా మసలుకొనేవారిపై, దైవం మీద ప్రగాఢవిశ్వాసం కలిగిన వారిపై ఈ యుగప్రభావం స్వల్పంగా ఉంటుంది. ఈ పరాభవ నామ సంవత్సరంలో పెద్దలకు కూడా పరాభవాలు తప్పవు. గురుభక్తి కలిగిన వారు గురునింద చేసే వారిని ఎదుర్కోవాలి.అలా చేయకపోవడం కూడా గురునింద క్రింద లెక్కకు వస్తుంది. దైవానుగ్రహం వల్ల బెంగాల్లో తాటకా, పూతనా శూర్పణఖల అంశలతో జన్మించిన పాపాత్మురాలి పరిపాలన అంతమయ్యి, సనాతనధర్మరక్షకుల పాలన ఆరంభమయ్యింది. దేశ భద్రతకు ఇది చాలా అవసరం. ఈ సమయంలో ధర్మాత్ములైన వారందరూ పద్మ వికాసానికి నిత్యం కృషి చేయాలి. అధికమాసంలో చేసే దానధర్మాలు, జపతపస్సులు,తీర్థయాత్రలు అధిక ఫలం ఇస్తాయి. మే 17 నుండి జూన్ 15 వరకు అధిక జ్యేష్ఠ మాసం ఉన్నది. ఈ కాలంలో ఎవరికి ఎంత వీలుంటే అంతగా దానం చేయండి. అధిక జ్యేష్ఠంలో జూన్ 2 నుండి యమునానదీపుష్కరాలు ఏర్పడుతున్నాయి. అవకాశం ఉన్నవారు స్నానాలు చేయండి. ప్రణవపీఠం మే 29 నుండి మధురాబృందావన యాత్రకు భక్తులను తీసుకొని వెడుతున్నది. యమునాపుష్కర స్నానంతో పాటుగా భాగవత సప్తాహం కూడా జరుగుతున్నది. పాల్గొని తరించండి.వివరాలకు సంతోషగుప్తను సంప్రదించండి. ఈ అధిక మాసంలో పితృతర్పణాలు, పితృస్తవపారాయణం లేక శ్రవణం చేసి తరించండి. దేశభక్తి లేని దైవభక్తి వ్యర్థం. కనుక దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టండి. ప్రణవపీఠం విద్యానిధిలో సభ్యులుగా చేరిన వారికి ఈ కార్యక్రమం పై అవగాహన ఉంటుంది. విద్యానిధిలో సభ్యులుగా చేరండి. ప్రణవపీఠం ఈ సంవత్సరం గుడి-బడితో బాటుగా అనేక చలివేంద్రాలు కూడా నిర్వహించింది. ఆయా ప్రాంతాలలో వాటిని నిర్వహిస్తున్న భక్తులందరకు అనేక దివ్యాశీస్సులు. ఆరోగ్యం లేని జీవితం సుఖవంతం కాదు కనుక, ఆసనాలు, వ్యాయామాలు, యోగాభ్యాసాలతో శిష్యకోటి నిత్యారోగ్యవంతులు కావాలని ఆకాంక్షిస్తున్నాను. అనేక దివ్యాశీస్సులతో

# శ్రీ గణేశ పురాణం



కాలినడకతో క్షేత్రాలను దర్శించడాన్ని శారీరిక లేక కాయిక తపస్సు అంటారు. (1) కాయిక తపస్సు (2) వాచిక తపస్సు (3) మానసిక తపస్సు. ఈ త్రివిధ తపస్సులతో ఎటువంటివాడైనా గొప్పవాడవుతాడు. తరిస్తాడు. కనుక తీర్థ యాత్రలు సాధ్యమైనంత వఱకు కాలినడకతో చేయాలి. అందుకే తులసీదేవి నడుస్తూ తీర్థయాత్రలు చేయసాగింది. ఒకనాడు ఆమె గంగానదీ స్నానానికి వెళ్ళింది. అక్కడ గణేశుని చూచింది. గణపతి సహజంగా పరమ సుందరుడు. నిజానికి లంబోదరుడు అనే శబ్దానికి జ్ఞానం పొట్ట యందు ఉంచుకున్నవాడు అనే తప్ప — అందరూ ఊహించుకున్నట్లు పెద్ద పొట్ట గలిగినవాడని కాదు. గణపతి సర్వకాలసర్వావస్థలలో ముప్పది సంవత్సరాల వయస్సుతో, నవయౌవనంలో ఉంటాడు. ఆ సమయంలో ఆయన శరీరమంతా గంధం పూయబడి ఉంది. సర్వకాంచన రత్నాభరణాలు ధరించి ఉన్నాడు. బ్రహ్మ కల్పంలో గణపతి భక్తులకు గణముఖంతో కాక, శివముఖంతో దర్శనమిచ్చేవాడు. చిరునవ్వు ఆయన ముఖానికి మరింత శోభను చేకూరుస్తోంది. జన్మ మృత్యు జరాతీతుడు, ఇంద్రియాలను జయించినవారిలో, యోగులలో శ్రేష్ఠుడు, నిష్కాముడూ అయిన గణపతిని చూడగానే తులసి మోహపరవశురాలయింది. ఆయనతో ఇలా అన్నది — గణపతీ! శివ పుత్రుడివి. విష్ణుస్వరూపుడవు. నీ శాంతసౌందర్యరూపం ఎవరినైనా ఆకర్షిస్తుంది. ఇంత అందంగా కనబడేనీవు, ఎల్లవేళలా ఇలా కనబడక అప్పుడప్పుడు గజముఖంతో, లంబోదరుడవై ఎందుకు కనిపిస్తావు? నీకు ఏకదంతం ఎందుకు వచ్చింది? ఎప్పుడు చూసినా ధ్యానమగ్నుడవై కనిపిస్తూ ఉంటావు. కాస్తంత ఇహలోకంలోకి కూడా రావాలి. నీవంటే అభిమానం కలిగిన వారిని కటాక్షించాలి. ఇలా పలుకుతూ గణపతిపై అంతకంతకీ ప్రేమ పెరుగుతూ ఉండగా, అతని శిరస్సుపై కొద్దిగా గంగాజలం చల్లింది.

.. ఇంకా ఉంది

# శ్రీ వేంకటేశ్వర రహస్యము

శ్లోII తత్ర తీర్థాని సర్వాణి సర్వపాపహరాణిచ II
షట్ షష్టి కోటి తీర్థాని, విద్యంతే వేంకటాచలే II (అ.50.శ్లో.34)

ఆ వేంకట పర్వతంపై సర్వపాపాలనూ హరించే అనేక తీర్థాలున్నాయి. 66 కోట్ల తీర్థాలు వేంకటాచలంలో ఉన్నాయి. ఈ పుణ్యతీర్థాలన్నింటిలోకి ఉత్తమోత్తమం అయిన తీర్థం స్వామి పుష్కరిణి. పుష్కరిణీ తీరంలోనే శ్రీనివాసుడు, లక్ష్మితో కలసి అగస్త్యుడు, శంఖణుడు ముున్నగు మహాత్ములకు దర్శనం ఇచ్చాడు. ఆ పుష్కరిణిలో స్నానం చేసిన వాడు పుణ్యాత్ముడు అవుతాడు. లక్ష్మీ వల్లభుని కటాక్షానికి పాత్రుడవుతాడు. ఇహపరాలు రెండూ అందించే దైవం వేంకటపతి. వేంకటగిరిపై ఘోణతీర్థమనబడే ఒక దివ్యతీర్థం ఉంది. ఘోణతీర్థంలో స్నానం చేసినవారు సర్వపాపాల నుండి తత్ క్షణమే విముక్తులవుతారు. ఈ తీర్థంలో స్నానం చేయడానికి కాలంతో, పనిలేదు. మీనమాసంలో పౌర్ణమి నాడు ఈ తీర్థంలో స్నానం చేయడం పరమప్రశస్తం. ఆనాడు చేసిన స్నానానికి గల విలువ ఇంతింతని చెప్పలేము. నీవు, నీతో బాటుగా నిన్నాశ్రయించుకొన్న సర్వాబద్ధుడు వేంకటాద్రికి వెళ్ళండి. [మీనమాసం అనగా సూర్యుడు మీనరాశిలో ప్రవేశించినపుడు ఆరంభమయ్యే సౌరమాన మాసం. సాధారణంగా ఇది ఉగాదికి కొంచెం అటూ ఇటుగా వస్తుంది.

2026 లో మార్చి 15 నుండి ఏప్రిల్ 13 వరకు ఈ మాసం ఉంటుంది. ఈ సంవత్సరం ఏప్రిల్ రెండున మీనమాసంలోని పౌర్ణమి ఏర్పడింది.] మీనమాసంలోని పూర్ణిమా శుభదిన మందు మీరు ఘోణతీర్థస్నానం చేయండి. సకల పాపాలూ నశిస్తాయి. ఇంతింతనరాని మహాపుణ్యం లభిస్తుంది. అనేక విచిత్ర వృత్తుల వలన మానవులకు సంభవించే దోషాలన్నింటికీ ఇదే పరిహారం. వశిష్ఠా! బ్రహ్మాండాలలో ఇటువంటి క్షేత్రం మరొక్కటి లేదు. తీర్థాలలో ఘోణతీర్థం వంటి తీర్థం లేదు.



# శ్రీ మత్స్యమహాపురాణం

బ్రహ్మదేవుడు నూరేండ్ల పాటు శతరూపతో సహజీవనము చేయడం వల్ల సారూప్యంతో కుమారుడు పుట్టాడు. అతనికి స్వాయంభువుడు, విరాట్ అనే పేర్లు మనకు అనుశ్రుతంగా వినవస్తున్నాయి. ఈతని రూపమును, గుణములను బ్రహ్మరూపగుణాలతో సమానంగా ఉండడం వల్ల అధిపూరుషుడు అని కూడా పేరు వచ్చింది. ఈ స్వాయంభువుడు, స్వారోచిషుడు, ఉత్తముడు మొదలగు పదునాల్గు మంది మనువులు పుట్టారు. వారంతా బ్రహ్మతో సమానమైన రూపగుణాలు కలిగి ఉన్నారు. ఇప్పుడు వారిలో ఏడవమనువు వైవస్వతుడు. మనుష్యులను పరిపాలిస్తున్నాడు. [1.స్వాయంభువ మనువు 2.స్వారోచిష మనువు 3.ఉత్తమ మనువు 4. తామస మనువు 5.రైవత మనువు 6.చాక్షుస మనువు 7.వైవస్వత మనువు 8.సూర్వసావర్ణి 9.దక్షసావర్ణి 10.బ్రహ్మసావర్ణి 11.ధర్మసావర్ణి 12.రుద్రసావర్ణి 13.దేవసావర్ణి 14.ఇంద్రసావర్ణి మనువులు].మత్స్యభగవానుని మాటలు విన్న మనువు ఇలా అన్నాడు —"ప్రభూ! బ్రహ్మదేవుడు స్వయంగా తానే సృష్టించిన (కుమార్తెను) శతరూపను వివాహమాడాడన్నారు గదా! ఇది చాల నీచమైన పనిగదా! అటువంటప్పుడు బ్రహ్మ ఏ ప్రాయశ్చిత్త కర్మమునాచరించి, దోషరహితుడై లోకములకు ద్వేషించరానివాడయ్యాడు. అతని కుమారులు ఒకరికి ఇంకొకరు సగోత్రులగుదురు గదా! అటువంటప్పుడు వారికి వారికి వైవాహిక సంబంధము ఎలా పొసగుతుంది? ఈ సందేహాన్ని నివృత్తి చేయండి." ఆ మాటలు విన్న మత్స్యభగవానుడు ఇలా పలికాడు — మనువా! నీకు కలిగిన అనుమానాన్ని నేను పూర్తిగా తొలగిస్తాను. శ్రద్ధగావిను. నేను చేసిన ఆది సృష్టి రజోగుణంతో పుట్టింది. అది లోక సాధారణమయినది కదు. ఇంద్రియముల కందనిది. ఇంద్రియాలకు గోచరించని శరీరం కలది. దాని రూపం దివ్యమైంది. ఉత్తమమగు జ్ఞానంచే ఉత్పత్తి చెందినది. మానవులు తమకు కలిగిన మాంసపు కన్నులతో దానిని పూర్తిగా చూడలేరు. క్రింద సంచరించు పాములు, పైన ఎక్కడో ఆకాశంలో సంచరించు పక్షుల ఉనికిని చూడగలవు. అలాగే దివ్యులైనవారి మార్గములను వేదములు తప్ప సామాన్య మానవులు గ్రహింపలేరు. అందువల్ల మానవులు అటువంటి మహనీయుల తత్త్వాన్ని విచారణ చేసుకొంటూ శుభఫలితాన్ని పొందాలి. మత్స్యభగవానుడు మనువుతో ఇంకా అన్నాడు — మనువా! సావిత్రికి బ్రహ్మపొందుట కూడా దోషం కాదు. అదెట్లో చెపుతాను. జాగ్రత్తగా విను. బ్రహ్మదేవుడు సకల విద్యలకు అధిష్ఠాత. సర్వవిద్యారూపయగు "గాయత్రి" అతని శరీరం నుండే పుట్టిందని, అందుకే ఆమె కూతురు అవుతుందని చెప్పబడుతోంది. ఆ ఇరువుతూ శరీరం ఉన్నా, లేకున్నా ఆలుమగలే. విద్యాధిష్ఠాతయగు బ్రహ్మ ఉన్న చోట — విద్యారూపిణియగు సరస్వతి కూడా ఉండి తీరుతుంది. అంటే భారతి ఉన్నచోట బ్రహ్మ ఉండి తీరుతాడు. సూర్యుడు లేని ఛాయ ఎక్కడా ఉండనట్లు సరస్వతి (గాయత్రి) బ్రహ్మను విడిచి ఉండదు. వేద రాశి రూపుడైన బ్రహ్మను సావిత్రి ఆశ్రయించే ఉంటుంది. అందుకే బ్రహ్మ సావిత్రిని పొందే సమయంలో ఏ మాత్రం దోషం లేదు. ఏలయన సావిత్రితో కలియనంత వరకును బ్రహ్మ అజ్ఞానంతో కూడి ఉన్నాడు. తన కుమార్తెను తాను పొందిన కారణంగా, జ్ఞానోదయమై బ్రహ్మదేవుడు మన్మథుడిని శపించాడు.

....ఇంకా ఉంది



# ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః　　శ్రీ మాత్రేనమః　　శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 355. సంహృతాశేషపాషండా [ఓం ఐం హ్రీం శ్రీం సంహృతాశేషపాషండాయై నమః]



సంహృత — పూర్తిగా నాశనం చేయబడిన, అశేష పాషండా — సర్వపాషండులు కలది. పాషండులందరనూ పూర్తిగా నాశనం చేస్తుంది అని అర్థం. పాషండులంటే ఎవరు? వేదాలకు వ్యతిరేకంగా ప్రవర్తించేవారు, శ్రౌతస్మార్త కర్మలు చేయనివారు, బహిష్కరింపబడినవారు పాషండులు. సనాతన ధర్మం నాశనం చేయాలని చూసే పాపాత్ములు అని అర్థం. కేవలం బుద్ధినే నమ్ముకొని, అన్నిటికి హేతువులను వెదకేవారు పాషండులు. కొన్ని వస్తువులను చూడలేము. అయినా అవి ఉన్నాయి. ఉంటాయి. అది తెలియక మూర్ఖవాదన చేసే వారు పాషండులు. పాకండులు అన్నా ఇదే అర్థం. వీరందరనూ అమ్మవారు నాశనం చేస్తుంది.

### మంత్ర ప్రయోగం — ఫలితం

నాస్తిక మార్గంలో నడుచుకొనే వారిని, మూర్ఖులను బాగుచేయాలి, అనుకొన్నప్పుడు వారి కోసం పురోహితులచే ఈ మంత్రం జపం 40 దినాలు చేయించుకోవాలి. అమ్మవారికి మారేడాకులు, కుంకుమతో పూజచేస్తూ, పులిహోరను నివేదించి, ఈ మంత్రాన్ని దినమునకు 300 సార్లు చొప్పున 40 దినాలు జపం చేసుకొన్నా, ఇతరులచే చేయించుకొన్నా పాషండులు, నాస్తికులు సరి అవుతారు. బాగుపడతారు.


... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

# ఋషి చరిత్ర

# ఋష్యశృంగ మహర్షి

అంగదేశాన్ని పరిపాలించే రోమపాదుడు అనే రాజు కాలంలో ఆ రాజ్యంలో తీవ్రమైన కరువు వచ్చింది. వర్షాలు పడలేదు, పంటలు పండలేదు, ప్రజలు అల్లాడారు. పండితులు దానికి నివారణగా—— "ఋష్యశృంగ మహర్షి మీ రాజ్యానికి వస్తే, వర్షాలు పడతాయి" అని రాజుకు చెప్పారు. రోమపాదుడు ఋష్యశృంగ మహర్షిని రాజ్యానికి తీసుకొచ్చే పని చేసాడు. మహర్షి అంగదేశంలో అడుగు పెట్టిన వెంటనే వర్షాలు కురిసాయి, కరువు తీరింది. సంతోషించిన రాజు తన పుత్రిక శాంతాదేవిని ఋష్యశృంగ మహర్షికి యిచ్చి వివాహం చేసాడు.అయోధ్య మహారాజు దశరథుడికి సంతానం లేకపోవడం వలన ఎంతో దుఃఖం కలిగేది. ఆయన గురువు వశిష్ఠుడు, మంత్రి సుమంతుడు దశరథునికి ఋష్యశృంగ మహర్షి చేత పుత్రకామేష్టి యాగం చేయించినట్లయితే మీకు సంతానయోగం కలుగుతుందని చెప్పారు. దశరథుడు సంతోషించి, ఋష్యశృంగ మహర్షిని ఆహ్వానించాడు. మహర్షి యాగం చేసాడు. యాగాగ్ని నుండి పాయసం ఉద్భవించింది. దశరథుని ముగ్గురు భార్యలు ఆ పాయసాన్ని సేవించారు. ఆ ఫలితంగా శ్రీరాముడు, భరతుడు, లక్ష్మణుడు, శత్రుఘ్నుడు జన్మించారు. ఇలా ఋష్యశృంగ మహర్షి తపశ్శక్తి శ్రీమహావిష్ణువు అవతారానికిదోహదపడింది —— ఇది ఆయన మహిమను వేనోళ్ళ చాటుతుంది.కర్ణాటక రాష్ట్రంలో శ్రీంగేరి అనే పవిత్రమైన పట్టణం ఉంది. ఆ పట్టణం పేరు ఋష్యశృంగ మహర్షి పేరు నుండే వచ్చింది. ఆ ప్రదేశంలో ఆయన తపస్సు చేసారని నమ్ముతారు. మహర్షి చివరి రోజులలో అడవికి తిరిగి వెళ్ళి తపస్సు చేసారు. ఆయన దేహత్యాగం సమయంలో ఒక తేజస్సు ఆయన శరీరం నుండి వెలువడి శివలింగంలో కలిసిపోయిందని చెప్పబడుతుంది. ఆ శివలింగం "*మలహానికారేశ్వర* 'పేరిట నేటికీ పూజలందుకుంటుంది. ఋష్యశృంగ మహర్షి జీవితం మనకు బ్రహ్మచర్యం ,శుద్ధత,తపస్సు, ధర్మపాలన మరియు నిరాడంబర జీవనం వంటి అనేక విలువైన పాఠాలు నేర్పిస్తుంది.ఋష్యశృంగ మహర్షి అడవిలో పెరిగినా, లోకానికి వెలుగు ప్రసాదించారు. ఆయన జీవితం —— జననం నుండి శివలింగంలో విలీనం వరకూ —— అంతా ఒక దివ్య ప్రణాళికలో భాగమే. మన పురాణాలు ఇలాంటి మహాపురుషుల చరిత్రలను మనకందిస్తున్నాయి, ఎందుకంటే వారి జీవితాలే మనకు మార్గదర్శనాలు. ధర్మనిష్ఠతో, నిర్మలమైన మనసుతో జీవించిన వారు ఎంత గొప్ప కార్యాలనైనా సాధించగలరు—— ఇదే ఋష్యశృంగ మహర్షి మనకు చెప్పిన సందేశం.


.ఇంకావుంది



## దివోదాసుని వృత్తాంతం

శివుడు ఢుంఢి గణపతిని స్తోత్రము చేసెను . ఆ స్తోత్రమును మనుషులు చేస్తే కలుగు శుభములను వివరించెను. ఆ తర్వాత కాశీ యందు 56 రూపములతో ఏడు ఆవరణలలో కొలువుదీరిన వినాయకుడిని ,ఆయన రూపములను దర్శించడం వల్ల కలుగు ఫలితములను వివరించెను.మందర పర్వతము నకు వినాయకుడు తిరిగి రాక పోవడం వలన శివుడు విష్ణువును పిలిచి కాశీ కి వెళ్ళి దివోదాసునకు మోక్షము కలిగించమని చెప్పెను. విష్ణువు గరుడ ,లక్ష్మీ సమేతముగా కాశీ వెళ్ళి పాదోదక తీర్థములో స్నానము ఆచరించెను ,తర్వాత ప్రస్తుతము సార్నాథ్ గా పిలవబడుతున్న ధర్మక్షేత్రము అనే ప్రదేశమునకు వెళ్ళి సన్యాస రూపమును ధరించి పుర ప్రజలను ఆకర్షించెను. దివోదాసు గణపతి చెప్పిన విధంగా 18వ రోజు వరకు ఎదురుచూసెను. మారు వేషము లో ఉన్న విష్ణువును చూసి గురువుగా భావించి ఆదేశము కోరెను . విష్ణువు దివోదాసును చూసి లింగ ప్రతిష్ఠ చేయమని చెప్పెను . దివోదాసు తన కుమారుడికి పట్టాభిషేకము చేసి రాజ్యమును అప్పగించి ,ప్రజల వద్ద సెలవు తీసుకొని విష్ణువు చెప్పిన విధంగా దివోదాసేశ్వర లింగమును ప్రతిష్ఠ చేసెను. ఆ తర్వాత దివ్య విమానము దివోదాసుడిని తీసుకొని వెళ్ళేను . ఈ విధంగా శివానుగ్రహమును దివోదాసు పొందెను.

**కాశీ కథలు సమాప్తము (దివోదాస వృత్తాంతము సమాప్తము )**



# శ్రీ గణపతి షోడశనామ స్తోత్రమ్

సుముఖశ్చైకదంతశ్చ కపిలో గజకర్ణకః।

లంబోదరశ్చ వికటో విఘ్నరాజో గణాధిపః ॥ 1 ॥

ధూమ్ర కేతుః గణాధ్యక్షో ఫాలచంద్రో గజాననః।

వక్రతుండ శ్శూర్పకర్ణో హేరంబః స్కందపూర్వజః ॥ ౨ ॥

షోడశైతాని నామాని యః పఠేత్ శృణు యాదపి।

విద్యారంభే వివాహే చ ప్రవేశే నిర్గమే తథా।

సంగ్రామే సర్వ కార్యేషు విఘ్నస్తస్య న జాయతే ॥ 3 ॥

